సాక్షి
ఖమ్మం
సోమవారం । 16 । అక్టోబర్ । 2023



కుందేలు.. కాసులు

కుందేళ్ల పెంపకంపై దృష్టి పెట్టిన ఓ యువకుడు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఆర్జిస్తున్నాడు. 10లో



సబ్ కోర్టు కల సాకారం

మధిరకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు (సబ్ కోర్టు) మంజూరు కావడంతో ఆ ప్రాంత వాసుల కల సాకారం కానుంది. 12లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 22°

జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రత పెరుగుతుంది. రాత్రి వాతావరణం కొంత చల్లబడుతుంది.

కాంగ్రెస్ దూకుడు!

- ఖమ్మంపై తుమ్మల, పొంగులేటి స్కెచ్
- పార్టీలోకి బాలసాని, ముగ్గురు కార్పొరేటర్లు
- మాజీ కార్పొరేటర్లు, మరికొందరు నేతలూ జంప్
- ఈ పరిణామాలతో హీటెక్కిన రాజకీయం
- పోస్టుమార్టం చేపట్టిన మంత్రి పువ్వాడ



పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల, బాలసాని తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ దూకుడు పెంచింది. పార్టీ అభ్యర్థులను ప్రకటించిన రోజే ఖమ్మంలో చోటు చేసుకున్న పరిణామాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయాన్ని వేడెక్కించాయి. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం, వెంటనే మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించడం.. ఆ తర్వాత ముగ్గురు కార్పొరేటర్లు, పలువురు నేతల ఇంటికి వెళ్లడం చకచకా సాగాయి. ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు జరిగిన ఈ పరిణామాలు ఉత్కంఠగా కొనసాగాయి. ఇరువురు నేతలు గుంభనంగా చేసిన రాజకీయంతో బీఆర్ఎస్ షాక్‌కు గురైంది.

బాలసాని రాజీనామా చేసి..

బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్న మాజీ ఎమ్మెల్సీ బాలసాని ముందుగా ఆపార్టీకి రాజీనామా చేసి, కేసీఆర్‌కు లేఖ పంపారు. పార్టీపై అసంతృప్తిగా ఉండడం, భద్రాచలం నియోజకవర్గ సమన్వయ బాధ్యతల నుంచి తప్పించడంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న బాలసానితో ఇటీవల పొంగులేటి, తుమ్మల పలుమార్లు వేర్వేరుగా చర్చలు జరిపినట్లు తెలిసింది. తుమ్మలకు కాంగ్రెస్ అధిష్టానం ఖమ్మం సీటుపై గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బాలసాని ఆయన వెంట నడవాలని నిర్ణయించుకున్నారు. బాలసాని కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖంగా ఉండడంతో ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన తుమ్మల, పొంగులేటి నేరుగా ఆయన ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి తాను కృషి చేసినా అనుభవం లేని వారికి పలు బాధ్యతలు ఇచ్చి తనను అవమానించారని బాలసాని ఎమ్మెల్సీ తాతా మధునుద్దేశించి ఈ సందర్భంగా వ్యాఖ్యలు చేశారు.

ఒక్కొక్కరి ఇంటికి వెళ్లి..

బాలసాని పార్టీ మారుతారని బీఆర్ఎస్ అధిష్టానం ముందే ఊహించినా ముగ్గురు కార్పొరేటర్లు, పలువురు నేతలు ఇదే బాట పట్టడంతో అటు హైదరాబాద్, ఇటు ఉమ్మడి జిల్లాలో ఆసక్తికర చర్చ జరిగింది. తుమ్మల, పొంగులేటి బాలసాని ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించాక కార్పొరేటర్లు కమర్తపు మురళి, చావా మాధురి నారాయణ, రావూరి కరుణసైదుబాబు ఇంటికి వెళ్లి వారిని కూడా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం అల్లీపురంలోని బీఆర్ఎస్ నేతలు సంక్రాంతి నాగేశ్వరరావు, పత్తిపాటి వీరయ్య, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు ఇంటికి తుమ్మల, పొంగులేటి వెళ్లారు. సుడా డైరెక్టర్లు కోసూరి రమేష్‌గౌడ్, ఎండీ ఖాదర్ బాబా, మాజీ కార్పొరేటర్ భర్త పోట్ల వీరేందర్, ఏలూరి శ్రీనివాస్ కూడా తుమ్మల, పొంగులేటి వెంట నడవనున్నట్లు ప్రకటించారు.

నిర్బంధ రాజకీయం తట్టుకోలేకనే..

నిర్బంధ రాజకీయం తట్టుకోలేకనే తాము బీఆర్ఎస్‌ను వీడి తుమ్మల, పొంగులేటి బాటలో నడుస్తున్నట్లు కార్పొరేటర్ కమర్తపు మురళి, చావా నారాయణ విలేకరుల సమావేశంలో తెలిపారు. దీంతో నియోజకవర్గ బీఆర్ఎస్‌లో ఇంకా ఎవరు అసంతృప్తిగా ఉన్నారు?, ఎవరు కాంగ్రెస్‌లో చేరుతారనే చర్చ జరుగుతోంది. ఒకే రోజు ముగ్గురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగిలినట్లయింది. మంత్రి పువ్వాడ ప్రగతి భవన్‌లో బీ ఫామ్ తీసుకుంటున్న సమయంలోనే ఖమ్మంలో జరిగిన రాజకీయం ఆ పార్టీని ఉలికిపాటుకు గురి చేసింది. ఆ తర్వాత మంత్రి హుటాహుటిన ఖమ్మం చేరుకొని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, రఘునాథపాలెం మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

సంగ్రామంలో విజయం మాదే.. 10లో

అజయ్ అన్న వెంటే ఉంటాం..



మమతా కళాశాలలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన మంత్రి పువ్వాడ


వచ్చే ఎన్నికల్లో పువ్వాడ అజయ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని, తామంతా ఆయన వెంటే ఉంటామని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు తెలిపారు. మమత మెడికల్ కళాశాలలో ఖమ్మం నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో మంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటర్లను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం వంటి ప్రణాళికలపై సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు చేసినా.. ప్రలోభాలకు గురి చేసినా తమ స్వేదం చివరి బొట్టు వరకు ఎదురొడ్డి పోరాడి పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించుకుంటామని తెలిపారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని, ఇక్కడ గెలిచేది అజయ్ అన్నేనని చెప్పారు. బీ ఫామ్ తీసుకుని ఖమ్మం చేరుకున్న మంత్రికి కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

జంగ్ తెలంగాణ

అధికారికంగా ఆ రెండు

మధిర నుంచి భట్టి.. భద్రాచలానికి పొదెం

- తొలి జాబితాలో ప్రకటించిన ఏఐసీసీ
- రెండో లిస్ట్‌లోనే తుమ్మల, పొంగులేటి, ఇతర అభ్యర్థులు
- సీపీఐకి కొత్తగూడెం కేటాయించే చాన్స్



భట్టి విక్రమార్క బయోడేటా..



పేరు : మల్లు భట్టివిక్రమార్క
తల్లిదండ్రులు: మాణిమ్మ, అఖిలాండ
పుట్టిన తేది : 15.06.1961
విద్యార్హత : ఎంఏ
భార్య, పిల్లలు : మల్లు నందిని, ఇద్దరు కుమారులు

ఇప్పటి వరకు పార్టీలో పనిచేసిన వివరాలు:

- 1990 – 92 పీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్
- 1994 – 2000 ఆంధ్రాబ్యాంక్ డైరెక్టర్‌గా..
- 2000 – 2003 పీసీసీ కార్యదర్శిగా..
- 27.04.2007–29.03.2009వరకు ఎమ్మెల్సీ
- 2009 మేలో మధిర ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రభుత్వ చీఫ్ విప్‌గా
- 04.06.2011 – 2014 శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా
- 11.03.2014న టీపీసీసీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా నియమితులయ్యారు.
- 2014లో మధిర నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం
- 28.02.2015న సీఎల్పీ కార్యదర్శిగా ఎన్నిక
- 28.05.2015న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక
- 19.09.2018న అసెంబ్లీ ఎన్నిక ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు
- 07.12.2018న మధిర ఎమ్మెల్యేగా మూడోసారి విజయం
- 18.01.2019 నుంచి సీఎల్పీ నేతగా కొనసాగుతున్నారు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే రెండు అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల పేర్లు అధికారికంగా ఖరారయ్యాయి. ఏఐసీసీ ఆదివారం 55 స్థానాలకు ప్రకటించిన మొదటి జాబితాలో మధిర, భద్రాచలం నియోజకవర్గాలున్నాయి. సిట్టింగ్‌లైన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు ఈ స్థానాలు కేటాయించారు. వీటితోపాటు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్లు కూడా మొదటి జాబితాలోనే ఉంటాయని ప్రచారం జరిగింది. అయితే వారిద్దరితో పాటు మిగిలిన అభ్యర్థుల పేర్లు రెండో జాబితాలో ఉండనున్నాయి. వామపక్షాల పొత్తుతో కొత్తగూడెం స్థానాన్ని సీపీఐకి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఊహించినట్లుగానే ..

ఏఐసీసీ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎలాంటి సంచలనాలు లేవు. వివాదాలకు తావు లేని విధంగా మధిర, భద్రాచలం స్థానాలను ప్రకటించారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు మధిర టికెట్ కేటాయింపు లాంఛనమేనని తెలిసిందే. భట్టి మధిర నుంచి నాలుగోసారి బరిలో నిలవనున్నారు. 2009, 2014, 2018లో ఆయన మధిర నుంచి గెలుపొందారు. ఇక భద్రాచలం టికెట్‌పై కొంత అనుమానాలు వ్యక్తమయ్యాయి. వామపక్షాలతో పొత్తు నేపథ్యంలో భద్రాచలం సీటు సీపీఎంకు కేటాయిస్తారనే ప్రచారం జరిగింది. అయితే పొదెం వీరయ్య డీసీసీ అధ్యక్షుడిగా ఉండటం, సిట్టింగ్ సీటు కావడంతో ఆ సీటు వదులుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఒప్పుకోలేదని తెలిసింది. దీంతో ఈ రెండు స్థానాలను మొదటి జాబితాలోనే ప్రకటించారు.

కాంగ్రెస్‌తో ముడిపడి..

మల్లు భట్టి విక్రమార్క రాజకీయ జీవితం మొత్తం కాంగ్రెస్‌తోనే ముడిపడింది. ఆయన 2004లో మధిర నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయించడంతో భట్టి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల ద్వారా ఎమ్మెల్సీ అయ్యారు. 2009లో శాసనసభ ఎన్నికల్లో మధిర నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. 2014లో మరోసారి మధిర నుంచి గెలుపొందారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 2018 ఎన్నికల్లోనూ భట్టి మధిర నుంచి విజయం సాధించి సీఎల్పీ నేతగా ఎన్నికయ్యారు.

వారి పేర్లు లేకుండానే..

ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరుకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్లు ఖరారయ్యాయని రెండు, మూడు రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రకటించిన జాబితాలో ఆ ఇద్దరి పేర్లు ఉంటాయని అందరూ భావించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. అయితే వీరి పేర్లు లేకుండానే జాబితా వెలువడింది. ఖమ్మం నుంచి తుమ్మల, పాలేరు నుంచి పొంగులేటి పోటీ చేసేందుకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీరిద్దరితోపాటు ఉమ్మడి జిల్లాలో మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు కూడా ప్రకటించనున్నారు. ఈ జాబితా కోసం అటు ఆశావహులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

సీపీఐకి కొత్తగూడెం..?

కమ్యూనిస్టులతో పొత్తు అంశం కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం స్థానాన్ని సీపీఐ, భద్రాచలం, పాలేరు స్థానాలను సీపీఎం కోరినట్లు తెలిసింది. అయితే కొత్తగూడెం సీటు మాత్రం సీపీఐకి కేటాయించేందుకు అంగీకారం కుదిరినట్లు తెలిసింది. సీపీఎంతో పొత్తుపై కొనసాగుతున్న చర్చల పీటముడి వీడలేదు. భద్రాచలం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య పేరు ప్రకటించగా.. పాలేరు నుంచి పొంగులేటి అభ్యర్థిత్వం కూడా ఖరారైనట్లు సమాచారం. సీపీఎంకు మరో జిల్లాలో సీట్లు కేటాయించనున్నట్లు తెలిసింది. సీపీఐకి కొత్తగూడెం ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడి నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బరిలో దిగనున్నట్లు సమాచారం. ఆ మూడు స్థానాలు పోగా.. కాంగ్రెస్ నుంచి ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, వైరా, అశ్వారావుపేట, ఇల్లెందు, పినపాక స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు మలి జాబితాలో ఉండనున్నాయి. ఈ జాబితా వారం రోజుల్లో ఎప్పుడైనా విడుదల చేసేందుకు ఏఐసీసీ కసరత్తు చేస్తోంది. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీ మొదటి జాబితా ప్రకటన ద్వారా ఎన్నికల యుద్ధ రంగంలోకి దిగిందని చెప్పాలి.

న్యూస్‌రీల్

అంతర్‌జిల్లా చెక్‌పోస్టు తనిఖీ

బెల్ట్‌షాపును సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశం



చెక్‌పోస్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

తిరుమలాయపాలెం: చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని సుబ్లేడు క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంత మంది విధులు నిర్వర్తిస్తున్నారు.. ఎన్ని వాహనాలు తనిఖీ చేశారని అడిగి తెలుసుకున్నారు. వస్తువులు రవాణా చేసే వాహనాలను తనిఖీ చేయాలని, నగదు, మద్యం రవాణా నియంత్రించాలని అన్నారు. వాహనాల తనిఖీకి సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలని సూచించారు. ప్రతి చెక్ పోస్టులో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలని, 24 గంటల పటిష్ట నిఘా పెట్టాలని ఆదేశించారు.

బెల్ట్ షాప్ తనిఖీ

సుబ్లేడు క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు పక్కనే ఉన్న బెల్ట్ షాపును కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. షాపులో మద్యం సీసాలు లభించడంతో వెంటనే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాలని, అక్రమ మద్యం అమ్మకాలను అరికట్టాలని సూచించారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసే దుకాణాల పైనా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఎస్డీసీ రాజేశ్వరి, కూసుమంచి సీఐ జితేందర్ రెడ్డి, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రామకృష్ణ, ఎన్నికల డీటీ రవీందర్, ఆర్ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి గ్రీవెన్స్‌డే రద్దు

ఖమ్మం సహకారనగర్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ఈనెల 16న (సోమవారం) నిర్వహించే ప్రజావాణి(గ్రీవెన్స్ డే)ని రద్దు చేసినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులు ఆ విధుల నిర్వహణలో ఉన్నందున గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు గ్రీవెన్స్‌డేకు రావద్దని కోరారు.

రామాలయంలో సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, పూజలు నిర్వహించారు. అదేవిధంగా బేడా మండపంలో స్వామివారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

హామీలు అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

గుండాల: రాష్ట్రంలో స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు హామీలను విస్మరిస్తున్నారని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మళ్లీ పోరాటాలు తప్పవని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సీఐటీయూ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ వీఓలు గ్రామ పంచాయతీ కార్మికులు అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. తొలుత శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ రమా జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, టీఏజీఎస్ జిల్లా నాయకులు తోలెం మల్లయ్య, సాయనపల్లి సర్పంచ్ దుగ్గి రామూర్తి , నాయకులు అబ్దుల్ నబీ, వజ్జ సుశీల, ఈసం వెంకటమ్మ, సారమ్మ, జవ్వాజి పద్మ, నజీమా, ఆదిలక్ష్మి, కౌసల్య, పూలమ్మ, ధనమ్మ, వినోద తదితరులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి అభయహస్తం

- భద్రాద్రిలో వైభవంగా ప్రారంభమైన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- రామాయణ పారాయణం, లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు



ఆదిలక్ష్మి అలంకరణలో లక్ష్మీతాయారమ్మ వారు

భద్రాచలం: అమ్మల గన్న అమ్మ, జగన్మాత మహాలక్ష్మీ దేవి ఆదివారం తొలిరోజున 'ఆదిలక్ష్మి' అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమిని పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో 'శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు' ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణ మహోత్సవాన్ని ఆలయ వైదిక కమిటీ ప్రారంభించింది. సూర్యప్రభ వాహనంపై ఊరేగింపుగా తీసుకొచ్చిన స్వామివారిని ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి హారతి, పుష్పాంజలి సమర్పించారు. తొలిరోజు బాలకాండ పారాయణం గావించారు. శ్రీరామ పారాయణానికి స్వచ్ఛందంగా వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించారు.

అభయ హస్తమిచ్చిన ఆదిలక్ష్మి

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు మహాలక్ష్మీ అమ్మవారిని ఆలయ అర్చకులు ఆదిలక్ష్మి అవతారంలో అలంకరించారు. చతుర్భుజాలతోపై రెండు చేతుల్లో పద్మాలను ధరించి వరద–అభయ హస్తాలతో దర్శనమిచ్చిన ఆదిలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకుని తరించారు. మధ్యాహ్నం జరిగిన సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి సంతానలక్ష్మి అలంకరణ విశిష్టత..

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు సోమవారం సంతానలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. 'అఖిల జగన్మాతరం, అస్మన్మాతరం' అంటూ ప్రార్థిస్తారు భగవత్ రామానుజాచార్యులు. సకల చరాచర జగత్తు ఆ అమ్మ సంతానమని, అందుకే ఆమె సంతానలక్ష్మి అని, ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే సంతాన అవరోధాలన్నీ తొలగి సత్సంతానం, సుఖశాంతులు కలుగుతాయని పండితులు తెలుపుతున్నారు.


జమలాపురంలో వేడుకలు..



శ్రీబాలాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారికి అర్చకులు తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆ తర్వాత కలశ స్థాపన, గణపతి పూజ, రుత్విక్కరణ తదితర పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలోని శ్రీఅలివేలుమంగ అమ్మవారిని శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. భక్తులు శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్ రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల జయదేవశర్మ, అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, వకుళామాత స్టేడియం నిర్మాణ దాత తుళ్లూరు కోటేశ్వరరావు–నిర్మల పాల్గొన్నారు.

ఆదాయంలో అగ్రగామిగా నిలవాలి



గ్రాండ్ ఫెస్టివల్ జెండా ఎగురవేస్తున్న పవిత్ర

ఖమ్మం మామిళ్లగూడెం : ఆర్టీసీ ఆదాయంలో ఖమ్మం రీజియన్ అగ్రస్థానంలో నిలవాలని సంస్థ డిప్యూటీ రీజనల్ మేనేజర్ పవిత్ర కోరారు. గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ జెండాను ఆదివారం ఆమె ఖమ్మం డిపోలో ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి వరకు 100 రోజుల ఆర్టీసీ పండగ సందర్భంగా ఖమ్మం రీజియన్ ఉద్యోగులు సమష్టిగా కృషి చేసి చాలెంజ్‌లో ప్రథమ స్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలన్నారు. సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎఫ్ శ్రీనివాస్, టీఐ ఏఎస్‌రావు, సంక్షేమ బోర్డు సభ్యులు శ్రీనివాస్, కంట్రోలర్ ఏపీరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫామ్

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులు ఆదివారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పార్టీ బీ ఫామ్ అందుకున్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులు తీసుకున్నారు.



కేసీఆర్ నుంచి బీ ఫామ్ అందుకుంటున్న మంత్రి, ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్



సండ్ర వెంకటవీరయ్య(సత్తుపల్లి)



కందాల ఉపేందర్‌రెడ్డి (పాలేరు)



లింగాల కమల్‌రాజ్ (మధిర)



బానోత్ మదన్‌లాల్ (వైరా)

క్లుప్తంగా

నిజరూపంలో దర్శనమిచ్చిన మారెమ్మ తల్లి



నవరాత్రి వేడుకల్లో అమ్మవారు

ఖమ్మంరూరల్ : మండలంలోని రెడ్డిపల్లి శ్రీ మారెమ్మతల్లి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవ రాత్రి వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు తొలిరోజు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హోమం, కుంకుమార్చన నిర్వహించారు. 9 రోజుల పాటు అమ్మవారు రోజుకొక అలంకరణలో దర్శనమిస్తారని ఆలయ ప్రధానార్చకులు కాశవజ్జుల రామశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ శ్రీనివాస్, అర్చకులు గండికోట నరేందర్ శర్మ, కాశావజ్జుల సతీష్‌శర్మ, చక్రధర్ శర్మ, వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో 'గూడెం' వాసికి రజతం



దీక్షిత్‌ను అభినందిస్తున్న నాగపూరి రమేశ్

కొత్తగూడెంటౌన్: హనుమకొండ జేఎన్‌ఎస్ మైదానంలో ఈ నెల 15 నుంచి మొదలై 17 వరకు జరగనున్న 38వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కొత్తగూడెంనకు చెందిన జర్పుల దీక్షిత్ రజత పతకం సాధించాడు. పతకం క్రీడాకారుడిని ఆదివారం ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేశ్ అభినందించారు. ట్రయతలాన్‌లో 1,537 పాయింట్లు సాధించి జాతీయస్థాయిలో రజత పతకం సాధించాడని ఆయన తెలిపారు. అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ సారంగపాణి, అథ్లెటిక్స్ జిల్లా సెక్రటరీ మహీదర్, కోచ్ మల్లికార్జున్‌రావు, సుష్మాబాయ్, మాన్విత, క్రీడాకారులు దీక్షిత్‌కు అభినందనలు తెలిపారు.

చిమ్మపుడిలో మద్యం పట్టివేత

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో కిరాణా దుకాణంలో ఉన్న రూ.3,750 విలువ చేసే మద్యాన్ని సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టుకున్నారు. పరిమితికి మించి మద్యం కలిగి ఉన్న కారణంగా దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీధర్ తెలిపారు.


కామేపల్లిలో..

కామేపల్లి: మండలంలోని బర్లగూడెం గ్రామంలోని నాయక్‌తండాకు చెందిన లకావత్ రాంబాబు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద సుమారు రూ.2,300 విలువైన మద్యం బాటిళ్లు దొరికాయని, వాటిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

12 కేజీల గంజాయి స్వాధీనం

మధిర: ఒడిశా రాష్ట్రానికి చెందిన అనిత ప్రతన్ బ్యాగులో 12 కేజీల గంజాయి తీసుకెళ్తుండగా మధిర పట్టణంలోని ఆర్‌వీ కాంప్లెక్స్ వద్ద శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. మధిరలో గంజాయి విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు సదరు మహిళ అంగీకరించిందని, పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

ఖమ్మంక్రైం: నగరంలోని టూటౌన్ ప్రాంతంలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన మూడు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. టూటౌన్ ప్రాంతంలోని కూరగాయల మార్కెట్‌లోని బాత్‌రూమ్‌లో పడి ఉన్న మృతదేహం నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కుమారస్వామి అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావుకి తెలిపారు. పురుగులు పట్టి ఉన్న యాచకుడి మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావుతోపాటు ఆయన కుమారుడు అమరేశ్వరరావు సంచిలో కట్టి మార్చురికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

కుందేలు.. కురిపించింది కాసులు

- కుందేళ్ల పెంపకంలో రాణిస్తున్న యువకుడు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి
- 40తో మొదలై..800 పైగానే జీవాలతో..



నరసింహారావు షెడ్‌లోని కుందేళ్లు

కామేపల్లి: నలుగురూ నడిచే దారిలో కాకుండా కొత్త దారిలో ప్రయాణం ప్రారంభించి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆ యువకుడు. బీఎస్సీలో డెయిరీ సైన్స్ చదివి పట్టా పుచ్చుకున్నాక ప్రైవేట్ పశు వైద్యుడిగా సేవలందిస్తూనే తనకు ఆసక్తి ఉన్న కుందేళ్ల పెంపకంపై దృష్టి పెట్టి 40 కుందేళ్లతో పెంపకాన్ని ప్రారంభించాడు. పెంపకంలో లోతుపాతులను ఎదుర్కొంటూ నేడు 800కు పైగా కుందేళ్లు పెంచుతూ తక్కువ సమయంలో ఎక్కువ రాబడి పొందుతూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బోయినపల్లి నరసింహారావు.

చిన్నతనం నుంచే ఆసక్తి

చిన్నప్పటి నుంచి ఆయనకు మూగజీవాలు, పక్షులు, వ్యవసాయంపై ఆసక్తి ఉండేది. వ్యవసాయ రంగ అనుబంధ వ్యాపారం ఎంపిక చేసుకోవాలని అనుకునేవాడు. కానీ, వ్యాపారం మొదలు పెడితే లాభమో.. నష్టమో అని సందేహం వచ్చి ఆలోచించాడు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపారం చేస్తేనే లాభాలు వస్తాయని, అందుకు తనకు ఆసక్తి ఉన్న కుందేళ్ల పెంపకం చేపట్టాలని 2020లో రూ.50 వేల పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించాడు. కుందేళ్ల ఉత్పత్తి ఆశాజనకంగా ఉండటంతో వాటి పెంపకంపై పూర్తి భరోసా కలిగింది. దీంతో ఏడాది తర్వాత రూ.2.50 లక్షల పెట్టుబడితో ప్రత్యేక షెడ్, బోన్లు తాగునీటి కుండలు, లైట్లు, గాలిపంకాలు ఏర్పాటు చేయించాడు. కుందేళ్ల పోషణ కోసం మొక్కజొన్న పిండి, గోధుమ పొట్టు, పల్లీ చెక్క, మినరల్ మిక్స్, ఉప్పును దాణాగా అందిస్తున్నాడు. ఆరు నెలల వయసున్న కుందేలు బరువు కేజీన్నర నుంచి రెండు కిలోలు ఉంటుంది. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, మహబూబాబాద్‌తో పాటు ఏపీ నుంచి పెంచుకునేవారు, మాంసాహారంగా తీసుకునేవారు వచ్చి కొంటున్నారు. సగటున ఒక్కొక్కటి రూ.1,300 నుంచి రూ.2 వేల వరకు ధర పలుకుతోంది.

కుందేళ్లలో వెరైటీలు

కుందేళ్లలో అనేక రకాలు ఉండగా.. నరసింహారావు వాటిని పెంచుతున్నాడు. న్యూజిలాండ్ వైట్, సోవియట్ చించీల్లా, క్యాలిఫోర్నియా వైట్, గ్రే జేంట్, బ్లాక్ జేంట్, ప్లేమ్మి జేంట్, ఇంగ్లీష్ పాట్, సోవియట్ ఆర్జిన, ఆంగోర కుందేలు, సిల్వర్ ఫాక్స్ వంటి అరుదైన కుందేళ్లు షెడ్‌లో పెంచుతున్నాడు. వీటితో పాటు ఆస్ట్రేలియా పక్షులు, అరుదైన పావురాలు, ఆఫ్రికా చిలుకలు, కాక్‌టైల్ పక్షులు, కౌజులను కూడా ఆయన ఫారంలో చూడొచ్చు.



కుందేలు పిల్లలతో నరసింహారావు

మొదటి నుంచీ ఇష్టం ఉండేది

– బోయినపల్లి నరసింహారావు

నా చదువు పూర్తి అయిన వెంటనే ప్రైవేట్‌గా పశువులకు వైద్యం చేస్తుండే వాడిని. వ్యాపారం చేయాలనే ఆలోచన వచ్చి మొదటి నుంచి కుందేళ్లు అంటే ఇష్టం ఉండేది. దీంతో కుందేళ్ల వ్యాపారం ప్రారంభించా. మొదట 40 కుందేళ్లు తెచ్చా. ఇప్పుడు షెడ్‌లో 800పైగా కుందేళ్లు ఉన్నాయి. వీటిని ఎక్కువగా పెంచుకునేందుకు తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా గుండె, షుగర్, ఆస్తమా వ్యాధిగ్రస్తులకు వైద్యుల సూచనలతో కుందేళ్ల మాసం కొనుగోలు చేస్తున్నారు. శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడంతో పాటు హైప్రొటీన్ అందుతుందని, చిన్నపిల్లలకు సైతం త్వరగా జీర్ణం అవుతుందని కొనుగోలు దారులు చెబుతున్నారు. ఈ వ్యాపారంతో ఏడాదిలో ఖర్చులు రూ.2 లక్షలు పోనూ రూ.4 నుంచి 5 లక్షల ఆదాయం పొందుతున్నా.

సంగ్రామంలో విజయం మాదే..

ఆరు గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తాం

- బీఆర్‌ఎస్ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు
- మాజీ ఎంపీ పొంగులేటి, మాజీ మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలో అంతిమ విజయం తమదేనని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని నివాసంలో ఆదివారం ఆయన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేదని, బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని అన్నారు. యువత ఆత్మబలిదానంతో తెలంగాణ ఏర్పడితే ఒక ఉద్యోగం కూడా భర్తీ చేయకుండా వారిని మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికలు వస్తున్నాయనే సాకుతో హడావిడిగా నోటిఫికేషన్లు వేసినా ఏ ఒక్క పరీక్షనూ ప్రభుత్వం సక్రమంగా నిర్వహించలేదన్నారు. రాష్ట్రంలో ఇక ఉద్యోగాలు రావనే ఆవేదనతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మరాజ్యం రాబోతుందని, ఆ వెంటనే కల్వకుంట్ల కుటుంబం దోచుకున్న అవినీతి సొమ్మును రికవరీ చేసి వాటితోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు సాధ్యం కాదన్న కేటీఆర్, హరీశ్‌రావు ఇప్పుడు బీఆర్‌ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తన చరిత్ర తెరచిన పుస్తకమని, అది అందరికీ తెలుసని అన్నారు. 40 ఏళ్ల రాజకీయాల్లో ఉండి జిల్లాను ఏవిధంగా అభివృద్ధి చేయాలని చూశానే తప్ప ఎక్కడా వ్యక్తిగత లబ్ధికోసం పాకులాడలేదన్నారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలుసుకుని ప్రజలే తమ భవిష్యత్‌ను నిర్ణయించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో తమకు గౌరవం దక్కలేదన్నారు. జిల్లాలో బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండోసారి ఎమ్మెల్సీగా రెన్యువల్ చేశారే తప్ప తనకేమీ చేయలేదన్నారు. తాను వద్దని చెప్పినా భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇచ్చారని, మళ్లీ వేరేవారికి ఎందుకు ఇచ్చారో ఇంతవరకూ తనకు చెప్పలేదని అన్నారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో 10 నెలలుగా తిరుగుతూ పార్టీ బలోపేతానికి కృషిచేశానన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కార్పొరేటర్‌లు కమర్తపు మురళి, రావూరి కరుణా సైదుబాబు, చావా మాధురీ నారాయణరావు, నాయకులు తుమ్మల యుగంధర్, సాధు రమేష్‌రెడ్డి, సుడా డైరెక్టర్లు రమేష్‌గౌడ్, పోట్ల వీరేందర్, ఏలూరి శ్రీనివాసరావు, సంక్రాంతి నాగేశ్వరరావు, మిక్కిలినేని నరేందర్, తుంబూరు దయాకర్‌రెడ్డి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, విజయాబాయి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, కొంగర జ్యోతిర్మయి, చేతుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొంగులేటి అభిమాని ఆత్మహత్యాయత్నం

మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం నియోజకవర్గం నుండి పోటీచేయాలంటూ కొత్తగూడెం రుద్రంపూర్‌కు చెందిన జక్కనపల్లి ప్రసాద్ అనే యువకుడు పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కార్యకర్తలు అతడిని అడ్డగించి పొంగులేటి వద్దకు తీసుకెళ్లారు. పొంగులేటి కొత్తగూడెం నుంచి పోటిచేయకుంటే ఆయన అనుచరుడు ఊకంటి గోపాల్‌రావుకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని అతడు కోరాడు.

సంపద కోసమే దురాక్రమణలు, దాడులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జమీందార్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచవ్యాప్తంగా సంపన్నదేశాలు, సామ్రాజ్యవాద దేశాలు సంపద కోసం దురాక్రమణలు, దాడులు చేస్తున్నాయని ప్రొఫెసర్ బుడ్డిగ జమీందార్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో 'పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు – వాస్తవ పరిస్థితులు'అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 19వ శతాబ్దం ప్రారంభం నుంచి సమాజంలో వచ్చిన పెనుమార్పుల కారణంగా డీజిల్, పెట్రోల్ వినియోగం పెరిగిందని, డీజిల్, పెట్రోల్‌కు సంబంధించి ముడి చమురు నిల్వలున్న దేశాలను ఆక్రమించాలన్న ప్రధాన ఎజెండాగా అమెరికా సహా పలు సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నించాయని తెలిపారు. ఈ క్రమంలోనే 45 శాతం ముడి చమురు నిల్వలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయని, దీంతో అక్కడ చిచ్చుపెట్టి అంతర్గత పోరుకు దారితీశారన్నారు. 1945లో ఐక్య రాజ్య సమితి ఒక ఒప్పందాన్ని ఖరారు చేసిందని, అందులో భాగంగా పాలస్తీనాకు 45 శాతం భూభాగాన్ని, ఇజ్రాయిల్‌కు 55 శాతం భూభాగాన్ని కేటాయించారని చెప్పారు. గాజా అత్యంత జనసాంద్రతగలిగన ప్రాంతమని, ప్రస్తుతం ఇక్కడ ప్రజల జీవితాలను ఛిద్రం చేసేరీతిలో వరుస దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పాలస్తీనా దాడుల వెనుక సామ్రాజ్యవాదుల హస్తముందని ఆయన ఆరోపించారు. సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, శింగు నర్సింహారావు, శాంతి సంఘీభావ సంఘం బాధ్యులు యలమంచిలి రామకోటేశ్వరరావు, గడల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన యువకుడి ఆచూకీ లభ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు వద్ద శనివారం అర్ధరాత్రి లారీ ఢీకొని మృతి చెందిన ద్విచక్రవాహనదారుడి ఆచూకీ లభ్యమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టేషన్‌బేతంపూడికి చెందిన గుగులోత్ దినేశ్ (22)గా గుర్తించారు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడుకు చెందిన తన స్నేహితుడు మృతి చెందడంతో దినేశ్ అతడి అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో తల్లంపాడు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి లాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

బస్సు ఎక్కుతుంటే రూ.4.70 లక్షల సొత్తు చోరీ



బస్టాండ్‌లో రోదిస్తున్న బాధితురాలు

సత్తుపల్లి: బస్సు ఎక్కుతుండగా ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారు వస్తువుల బాక్స్‌ను అపహరించిన ఘటన ఆదివారం సత్తుపల్లి బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ఏలూరు జిల్లా పెద్దవేగి మండలం ఒంగూరు గ్రామానికి చెందిన కోటగిరి అనిత తన కుటుంబ సభ్యులతో కలిసి దమ్మపేట మండలం తాటి సుబ్బన్నగూడెంనకు తన పుట్టింటికి వెళ్లేందుకు సత్తుపల్లి బస్టాండ్‌కు వచ్చింది. ఉదయం 11 గంటల సమయంలో అశ్వారావుపేట బస్సు ఎక్కారు. లోపల సీటులో కూర్చొని టికెట్ డబ్బుల కోసం హ్యాండ్‌బ్యాగ్‌లో చెయ్యి పెట్టగా అందులోని బంగారు వస్తువులు ఉన్న బాక్స్ మాయమైంది. దీంతో ఆందోళన చెందిన ఆమె పరిసర ప్రాంతాలను పరిశీలించి అందరిని వాకబు చేసింది. అయినప్పటికీ కనిపించకపోవడంతో లబోదిబోమంటూ కన్నీటి పర్యంతమైంది. గుర్తుతెలియని మహిళ దొంగలు బస్సు ఎక్కేటప్పుడు హ్యాండ్‌బ్యాగ్‌లోని బాక్స్‌ను అపహరించినట్లు అనుమానిస్తున్నారు. ఆ బాక్స్‌లో 3 తులాల చంద్రహారం, 8 తులాల పది బంగారు గాజులు, ఒక బంగారు లాకెట్ ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.4.70 లక్షల వరకు ఉంటుందని చెబుతున్నారు. కాగా, ఇటీవల బస్టాండ్‌లో ఓ ఉద్యోగి ఆభరణాలు సైతం చోరీకి గురైనట్లు తెలిసింది. ఘటనా స్థలాన్ని సత్తుపల్లి పోలీసులు పరిశీలించి, సీసీ పుటేజీలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ కుశ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



నివాళులర్పిస్తున్న నాయకులు

కూసుమంచి: మండలంలోని గైగొళ్లపల్లి గ్రామానికి చెందిన సీపీఐ మండల నాయకుడు కత్రోజు పాదురంగాచారి కుమారుడు, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన కత్రోజు వివేక్ (23) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అవివాహితుడైన అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. వివేక్ మృతదేహాన్ని ఆదివారం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేశ్, మండల కార్యదర్శి భూక్యా నర్సింహ, మల్లేశ్ తదితరులు వివేక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తనిఖీల్లో రూ.3.5 లక్షలు స్వాధీనం



నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



ముత్తగూడెం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సూరజ్

కారేపల్లి: ఎన్నికల విధుల్లో భాగంగా కారేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్‌ఐలు పుష్పాల రామారావు, ప్రవీణ్‌కుమార్ ఆదివారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.2 లక్షల నగదు పట్టుబడింది. కారేపల్లి క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఖమ్మం నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న కారులో తనిఖీ చేయగా రూ.2 లక్షల నగదు లభించింది. వాహనదారుడు దుర్గా సతీశ్ వద్ద నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని, ఎన్నికల అధికారి సూచనల మేరకు ట్రెజరీకి పంపించామని పోలీసులు తెలిపారు.

లక్షన్నర నగదు స్వాధీనం

పెనుబల్లి: మండలంలోని ముత్తగూడెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించి లక్షన్నర నగదు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు నుంచి దమ్మపేట వెళ్తున్న కారును తనిఖీ చేయగా అందులో ఆధారాలు లేని రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు నుంచి కొత్తగూడెం వెళ్తున్న మరో కారులో రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

రూ.లక్ష సాయం చెక్కు మాయం.!

- లబోదిబోమంటున్న బీసీ లబ్ధిదారుడు
- బ్యాంకు అధికారుల నిర్లక్ష్యమే శాపం



ఏపీజీవీబీలో జమ చేసిన రూ.లక్ష రశీదు

అశ్వారావుపేటరూరల్: చేతివృత్తుల వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను అందించిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద తొలి విడతలో భాగంగా రూ.లక్ష సాయం చెక్కులను రెండు నెలల కిందట అందించగా, ఓ లబ్ధిదారుడి చెక్కు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో కనిపించకుండా పోయింది. ఈ విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన దేరంగుల మహేశ్‌తోపాటు మరో ఐదుగురికి బీసీ కార్పొరేషన్ ద్వారా గత ఆగస్టు 14వ తేదీన రూ.లక్ష చెక్కులు మంజూరవగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి లబ్ధిదారులకు అందించారు. అదే రోజు వారు చెక్కులను వినాయకపురంని ఏపీజీవీబీలో గల తమ ఖాతాల్లో జమ చేశారు. ఐదుగురు లబ్ధిదారుల చెక్కు వారి ఖాతాల్లో జమ కాగా, దేరంగుల మహేశ్ ఖాతాలో మాత్రం నెలలు దాటుతున్న జమ కాలేదు. నాటి నుంచి బాధితుడు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. కొద్ది రోజుల కిందట చెక్కు గురించి బాధితుడు బ్యాంకు అధికారులను నిలదీస్తే చెక్కు కనిపించడం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని బాధితుడు వాపోయాడు. బ్యాంకులో చెక్కు జమ చేసి రెండు నెలలు దాటుతున్నా నేటికి తన ఖాతాలో నగదు జమ కాకపోవడంతో బాధితుడి పరిస్థితి 'దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించడం లేదు'అన్నట్లుగా మారింది. బ్యాంకు మేనేజర్ సురేశ్‌నాయక్‌ను 'సాక్షి'వివరణ కోరగా.. కొత్తగూడెం బ్రాంచ్‌కు క్లియరెన్స్ కోసం పంపే క్రమంలో చెక్కు కనిపించకుండాపోయిన మాట వాస్తవమేనన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా మరో చెక్ జారీ చేయడం సాధ్యం కాలేదని, డిసెంబర్ తర్వాత మరో చెక్కు జారీ చేసి లబ్ధిదారుడి ఖాతాలో నగదు జమ చేస్తామని తెలిపారు. డిసెంబర్ 3 తర్వాత అసలుతోపాటు వడ్డీ కుడా చెల్లిస్తామని పేర్కొన్నారు.

కుక్కకాటుతో ముగ్గురికి గాయాలు



గాయపడిన లక్ష్మి, వెంకట్రావు

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని ఎన్టీఆర్‌కాలనీలో వీధి కుక్క ముగ్గురు చిన్నారులను తీవ్రంగా గాయపర్చిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని ఎన్టీఆర్‌కాలనీకి చెందిన తొమ్మిదేళ్ల నాగులవంచ లక్ష్మి, తన తమ్ముడు వెంకట్రావుతో కలిసి ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క వచ్చి దాడి చేసింది. చుట్టుపక్కల వారు చూసి కుక్కను తరిమికొట్టారు. అనంతరం అదేకాలనీలో మరో బాలుడు మాధవరపు ప్రేమ్‌కుమార్‌ను కూడా కుక్క కరిచింది. తీవ్రంగా గాయపడినవారిని బనిగండ్లపాడు పీహెచ్‌సీకి తరలించారు.

బస్సు ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు

వైరా: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం వైరా బస్టాండ్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ హెల్పర్ మేడి తిరపతమ్మ వ్యక్తిగత పని మీద వైరా వచ్చి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగి బయటకు వస్తుండగా మరో బస్సు రివర్స్ చేస్తూ ఢీకొట్టింది. తిరపతమ్మ కాలు మీద నుంచి టైరు ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జయింది. వెంటనే ఆమెను 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్



గాయపడిన రవి, పీక్యా

కారేపల్లి: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని గుట్టకిందిగుంపు సమ్మక్క – సారలమ్మ గద్దెల వద్ద ఆదివారం చోటుచేసుకుంది. సూర్యతండా గ్రామానికి చెందిన బాదావత్ రవి, జర్పుల పీక్యా ద్విచక్రవాహనంపై ఇల్లెందు వెళ్లి వస్తుండగా.. గుట్టకిందిగుంపు గ్రామం సమ్మక్క – సారలమ్మ గద్దెల వద్దకు రాగానే భాగ్యనగర్‌తండాకు చెందిన వాంకుడోతు భద్రు ట్రాక్టర్‌ను నడుపుతూ అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో రవి, పీక్యాకు తీవ్ర గాయాలవగా వారిని 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

జ్వరంతో వివాహిత మృతి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురంకాలనీకి చెందిన అచ్చె సృజన (23) జ్వరంతో మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన చిలకారావును మూడేన్నరేళ్ల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకొంది. కాగా, రెండు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న సృజన శనివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురి కాగా, స్థానిక ఓ గ్రామీణ వైద్యుడితో చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడం, పరిస్థితి విషమించడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతిచెందింది. ఆమె మృతికి గ్రామీణ వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ప్రచారం జరగడంతో స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ విచారణ చేస్తున్నారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: వివాహితను వేధిస్తున్న భర్తతోపాటు మరో ఇద్దరిపై ఆదివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని డ్రైవర్స్‌కాలనీకి చెందిన ఎండీ షబీనా, అమీర్‌కు నాలు గేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్తతో పాటు బంధువులు షబీనాను వేధిస్తున్నారు. ఈ క్రమంలోనే భర్తతో పాటు అత్త ఎండీ బేగం, బావ యాకూబ్ కలిసి ఆమెపై దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్త, బావపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

2017లోనే 'స్కిల్' కేసు

నమోదు, దర్యాప్తు మొదలైంది అప్పుడే

- స్పష్టం చేస్తున్న కేంద్ర జీఎస్టీ డీజీ లేఖ
- అప్పట్లోనే రాష్ట్రానికి సమాచారమిచ్చినా.. కేసును తొక్కిపెట్టిన టీడీపీ సర్కారు
- పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుంది
- చంద్రబాబుకు '17ఏ'వర్తించదని నిపుణుల స్పష్టీకరణ


DIRECTORATE GENERAL OF GST INTELLIGENCE, Pune Zonal Unit, 'A' Wing, 3rd Floor, GST Bhawan, Sasoon Road, Pune-411001.

F.No: DGGI/PRU/INT/42/2017/
Dated 28.02.2018

To : The Principal Director General, DGGSTI, New Delhi
From: Additional Director General, DGGSTI, PZU

INCIDENT REPORT NO. 22/ST/2017-18

Name and address of the assessee	M/s Skiller Enterprises India Pvt Ltd (formerly known as PVSP IT Skills Projects Pvt Ltd) 316/ 274 Second Floor, West End Marg, Saidulajab, New Delhi-110030 Service Tax Registration No. AAICP2127JSD001 Range-60, Hauz Khas New Division, Central GST Delhi-

స్కిల్ స్కామ్ కేసు 2017లోనే నమోదయ్యిందని కేంద్ర జీఎస్టీ డైరెక్టర్ జనరల్ 2018 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి రాసిన లేఖ

సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్ కేసులో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిన మాజీ సీఎం చంద్రబాబు 'సెక్షన్ 17ఏ'ను సాకుగా చూపిస్తూ విచారణను అడ్డుకునేందుకు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. ఈ కేసు 2020లో నమోదైందని బుకాయిస్తున్న టీడీపీ వాదనకు కేంద్ర జీఎస్టీ విభాగం లేఖ ద్వారా తెర దించింది. టీడీపీ సర్కారు హయాంలోనే స్కిల్ స్కామ్ మూలాలు వెలుగులోకి వచ్చాయని, దీనిపై 2017లోనే కేసు నమోదైందని ఆ లేఖలో స్పష్టం చేసింది. జీఎస్టీ విభాగం లేఖ వెలుగులోకి రావడంతో ఈ కేసులో కీలక ప్రశ్నలకు సమాధానాలు దొరికినట్టైంది.

సాంకేతిక సాకు ఎత్తుగడ

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయాలంటే గవర్నర్ అనుమతి అవసరమంటూ టీడీపీ వ్యూహాత్మకంగా ఓ ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. సీమెన్స్‌కు తెలియకుండా, ఆ కంపెనీ ముసుగులో సాగించిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు ఎలాంటి అవినీతికి పాల్పడలేదని టీడీపీ గానీ ఆయన న్యాయవాదులు గానీ చెప్పే సాహసం చేయలేకపోతున్నారు. 2018 నవంబరు నుంచి అమలులోకి వచ్చిన 17 ఏ సెక్షన్ ప్రకారం చంద్రబాబుకు రాజ్యాంగ రక్షణ లభిస్తుందని మాత్రమే అడ్డగోలుగా వాదిస్తున్నారు.

2017లోనే కేసు నమోదు..

చంద్రబాబు బృందం ఎతుగడలను కేంద్ర జీఎస్టీ విజిలెన్స్ విభాగం చిత్తు చేసింది. ఈమేరకు కేంద్ర జీఎస్టీ డైరెక్టర్ జనరల్ (డీజీ) రాసిన లేఖ తాజాగా వెలుగులోకి రావడంతో టీడీపీ పన్నాగం బెడిసి కొట్టింది. స్కిల్ స్కామ్ కేసు 2017లోనే నమోదై దర్యాప్తు కూడా అప్పుడే మొదలైనట్లు స్పష్టమైంది. కాబట్టి చంద్రబాబుకు సెక్షన్ 17ఏ వర్తించదని తేటతెల్లమైంది. 2017 మేలో పుణెలో కొన్ని షెల్ కంపెనీల్లో నిర్వహించిన తనిఖీల్లో జీఎస్టీ విభాగం భారీ అక్రమాలను గుర్తించింది. నకిలీ ఇన్వాయిస్‌లతో జీఎస్టీ ఎగవేతకు పాల్పడ్డ కంపెనీలను గుర్తించి విస్తృతంగా సోదాలు జరిపింది. వీటిలో స్కిల్లర్ అనే కంపెనీ కూడా ఉంది. దీనిపై నాడే తీగలాగడంతో చంద్రబాబు ప్రభుత్వ అవినీతి డొంకంతా కదిలింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (ఏపీఎస్ఎస్‌డీసీ) పరికరాలను సరఫరా చేసినట్లు చూపించేందుకు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించినట్లు తేలింది. ఆ ఇన్వాయిస్‌లను చూపించే ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి నిధులు పొందినట్లు నిర్ధారణ అయింది. దీనిపై జీఎస్టీ విభాగం 2017 మే నెలలోనే కేసు నమోదు చేసింది. పూర్తి స్థాయిలో విచారించి ఆధారాలతో సహా కుంభకోణాన్ని బట్టబయలు చేసింది.

పాత కేసులకు పాత చట్టమే

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులు దారి మళ్లడంపై విచారించాలని సూచిస్తూ ఏపీ ఏసీబీ విభాగానికి 2018 ఫిబ్రవరిలోనే సమాచారం ఇచ్చింది. ఈమేరకు కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ లేఖ రాశారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. చంద్రబాబు ఒత్తిడితో ఏసీబీ విభాగం ఆ కేసును తొక్కిపెట్టింది. అంటే స్కిల్ స్కామ్ బయటపడింది... కేసు నమోదైంది 2017లోనే అని స్పష్టమవుతోంది. అప్పటికి 17ఏ సెక్షన్ అమలులోకి రాలేదు. ఆ సెక్షన్ 2018 జూలైలో చేయగా 2018 నవంబరు నుంచి అమలులోకి వచ్చింది. కాబట్టి స్కిల్ స్కామ్ కేసులో నిందితుడు చంద్రబాబుకు 17ఏ సెక్షన్ కింద రక్షణ లభించదన్నది నిర్ధారణ అయినట్టేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుందని తేల్చి చెబుతున్నారు. అవినీతికి పాల్పడి ఆధారాలతోసహా అడ్డంగా దొరికిన చంద్రబాబు సాంకేతిక సాకులతో తప్పించుకునేందుకు చేస్తున్న యత్నాలు ఫలించవని వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ విభాగం డీజీ లేఖతో చంద్రబాబు కుట్ర బెడిసికొట్టినట్టేనని చెబుతున్నారు.

క్లుప్తంగా...

2014 నుంచి చేయలేనిది 2023లో చేస్తారా?

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: కన్న తల్లికి అన్నం పెట్టని వాడు, చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్టుగా బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఎద్దేవాచేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోపై అరుణ స్పందిస్తూ 2014 నుంచి కేసీఆర్ సీఎంగా ఉండి చేయలేని పనులు, 2023లో చేస్తానంటే తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు. నిరుద్యోగ భృతి హామీ ఏమైపోయిందని ప్రశ్నించారు. ఇప్పుడు ఇచ్చిన హామీలు కేవలం తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేయడానికి తప్ప, నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశం కేసీఆర్‌కు లేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేస్తానని చెప్పి, ఇంత వరకు దాని దిక్కు మొక్కు లేకుండా చేసిన ఘనుడు కేసీఆర్ అని ధ్వజమెత్తారు. కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధి ఏమి లేదు కాబట్టి, కేవలం ఉచిత పథకాలను నమ్ముకుని ఎన్నికలకు పోయేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. రేషన్ కార్డు ఉన్న వారికి ఉచితాలు ప్రకటించడం పక్కన పెట్టి, మొదట రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. ఆరోగ్య శ్రీ పథకం తెలంగాణలో అమలవుతోందా? ఒకవేళ అమలైతే, ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఎంత వరకు ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నారో వెల్లడించాలని అరుణ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాలు!

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని, ఈ విషయాన్ని శ్రీధర్‌బాబు నేతృత్వంలోని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీకి నివేదిస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు జి.ప్రతాప్‌రెడ్డి, దండ రామకృష్ణ, సభ్యులు క్రాంతి, పోలంపల్లి ఆంజినేయులు తదితరులు ఆదివారం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని చేర్చాలని ఆయన్ను కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు పట్ల కాంగ్రెస్ సానుకూలంగా ఉందని రేవంత్ హామీనిచ్చారు.

వాళ్లు చస్తే నా డబ్బులతో బీమా చెల్లిస్తా..

- సీఎం కుటుంబంపై ఎంపీ అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ మేనిఫెస్టో చించివేత



డిచ్‌పల్లి (నిజామాబాద్‌రూరల్): సీఎం కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్, కూతురు కవిత చనిపోతే తన సొంత డబ్బులతో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.15 లక్షలు బీమా కింద ఆ కుటుంబానికి చెల్లిస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. తెల్ల రేషన్‌కార్డుదారులు చనిపోతే రూ.5 లక్షల బీమా ఇస్తామని బీఆర్ఎస్ ప్రకటించడంపై మండిపడ్డారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయని సీఎం కేసీఆర్.. ఇప్పుడు ప్రకటించిన కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఇదొక చెత్త మేనిఫెస్టో అంటూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను ఎంపీ చించివేశారు. గతంలో తనను చెప్పుతో కొడతానని ఎమ్మెల్సీ కవిత అన్నారని, ఆమెను నలిపి బయటపడేస్తానని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం కేసీఆర్ కంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పెద్ద అవినీతిపరుడని, కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం పాతాళానికి పోతుందన్నారు. ఒకవేళ రాష్ట్రంలో హంగ్ వచ్చినా బీజేపీదే అధికారమని అర్వింద్ అన్నారు.

బీజేపీ టికెట్‌పై మునుగోడు నుంచే పోటీ: రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో తాను బీజేపీ టికెట్‌పై మునుగోడు నుంచే పోటీ చేస్తానని బీజేపీ నేత, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలను నమ్మరని, వాళ్లిద్దరూ ఒక్కటేనన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే పార్టీనని 2018 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడమే ఇందుకు తార్కాణమన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో తాను ఓడిపోయినప్పటికీ తనకు 87 వేల ఓట్లు వేసి నైతిక విజయం మునుగోడు ప్రజలు ఇచ్చారన్నారు.

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేందర్‌నాథ్‌రాయ్, జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.


ఆలయం వెలుపల జస్టిస్ మానవేందర్‌నాథ్ రాయ్



కుటుంబ సభ్యులతో జస్టిస్ రవీంద్రబాబు, కుటుంబ సభ్యులతో జస్టిస్ గోపాలకృష్ణారావు

పెట్టుబడుల పరుగులు..

- ఏపీలో మరో రూ.1,624 కోట్లు వాస్తవ రూపంలోకి..
- నేడు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నాలుగు యూనిట్ల ప్రారంభోత్సవాలు..



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఏపీ ప్రభుత్వం కృషి ఫలితంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మరో రూ.1,624 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యటనలో పలు ఐటీ, ఫార్మా కంపెనీల ప్రారంభోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు ఐజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమి టెడ్, లారస్ ల్యాబ్‌లను ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 4,160 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సీఎం సోమవారం ప్రారంభించే, భూమి పూజ నిర్వహించే యూనిట్ల వివరాలివీ..

ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్..
విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ హిల్ నెంబర్-2లో ఇన్ఫోసిస్ ఒక కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసింది. సుమారు రూ.41కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌ను భవిష్యత్తులో మరింత విస్తరించనున్నారు. ఇది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా పనిచేస్తుంది. దీని ఇంటీరియర్ డిజైన్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైబ్రీడ్ వర్క్‌ప్లేస్‌గా రూపొందించారు. దాదాపు వెయ్యి మంది ఈ సెంటర్ నుంచి పనిచేయనున్నారు.

ఇజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్..
ఫార్మా, బయోటెక్ ఉత్పత్తులకు సంబంధించి రూ.300.78 కోట్లతో పరవాడ ఫార్మాసిటీలో నిర్మించిన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఇజియా (ఈయూఐజీఐఏ) యూనిట్‌ను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు. ఈ యూనిట్ ద్వారా 800 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.

లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్..
యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్ (ఏపీఐ) ఉత్పత్తులకు సంబంధించి రూ.421.70 కోట్లతో అచ్యుతాపురంలో నిర్మించిన ఈ యూనిట్‌ను సీఎం ప్రారంభిస్తారు. దీని ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాల కల్పన జరగనుంది. ఇదే కంపెనీ మరో 15 ఎకరాల్లో రూ.407.40 కోట్లతో ఏర్పాటు చేసే యూనిట్ నిర్మాణ పనులకు కూడా సీఎం భూమిపూజ చేస్తారు.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్..
అచ్యుతాపురం ఏపీ సెజ్‌లోని లారస్ ల్యాబ్స్‌లో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని, యూనిట్-2 ఫార్ములేషన్ బ్లాక్‌ను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. రూ.460 కోట్లతో ఏర్పాటుచేసిన ఈ యూనిట్ ద్వారా 1,200 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతోపాటు రూ.407.40 కోట్లతో లారస్ ల్యాబ్స్ కొత్త పరిశ్రమకు కూడా సీఎం భూమిపూజ చేస్తారు. బీచ్ క్లీనింగ్ కోసం జీవీఎంసీ కొనుగోలు చేసిన ప్రత్యేక వాహనాల్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

జిల్లా వార్తలు

సబ్ కోర్టు కల సాకారం


శిథిలావస్థకు చేరిన మధిర పాత కోర్టు

- స్వాతంత్య్రం రాకముందే మధిరలో మున్సిఫ్ కోర్టు
- సబ్ కోర్టు మంజూరుతో కక్షిదారులకు తప్పనున్న తిప్పలు
- అఖిలపక్షాల ఆధ్వర్యాన గతంలో అనేక ఉద్యమాలు
- నూతన కోర్టు భవన నిర్మాణానికి రూ.24కోట్ల నిధులు
- ఈ భవనం కూడా నిర్మాణమైతే మరిన్ని వసతులు

మధిర: పలు దశాబ్దాలుగా మధిర ప్రాంత ప్రజలు చేపట్టిన అనేక ఆందోళన కార్యక్రమాలతో మధిరకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు (సబ్ కోర్టు) మంజూరైంది. మధిరలో ఇప్పటివరకు ఈ కోర్టు లేకపోవడంతో కక్షిదారులు, న్యాయవాదులు సత్తుపల్లి కోర్టుకు వెళ్లాలంటే వందల కిలోమీటర్ల ప్రయాణంతో పాటు రవాణా సౌకర్యం సక్రమంగా లేకపోవడం, ఖర్చులు భారం అవుతుండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మధిరలో 1930లోనే మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటైంది. స్వాతంత్య్రం రాక ముందే మధిరలో నైజాం కాలంలో తాలూకా కేంద్రాన్ని, కోర్టును మధిర మెయిన్ రోడ్డులో ఎదురెదురుగా నిర్మించారు. 1930లో స్థాపించిన మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు అభివృద్ధికి నోచుకోలేదు. వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కోర్టు మంజూరు కాలేదు. ఇటీవల కాలంలోనే ఈ ప్రాంత ప్రజల వినతులు, ఉద్యమాలు, ప్రజాప్రతినిధుల సహకారంతో అదనపు కోర్టు మంజూరైంది.

రవాణా ఇక్కట్లు
మధిరలో సబ్ కోర్టు లేకపోవడంతో పలు కేసులకు సంబంధించి సత్తుపల్లి కోర్టుకు వెళ్లాల్సి వస్తోంది. ఎర్రుపాలెం మండలం కాచవరం గ్రామానికి చెందిన కక్షిదారులు సివిల్ దావా కేసుల్లో సత్తుపల్లికి వెళ్లాలంటే కనీసం 150 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాలి. కాచవరం నుంచి ఎర్రుపాలెం వరకు, ఎర్రుపాలెం నుంచి మధిరకు, మధిర నుంచి వైరాకు, వైరా నుంచి సత్తుపల్లికి బస్సులు లేదా ఆటోలు ఎక్కి దిగాల్సి ఉంటుంది. రవాణా సౌకర్యం సక్రమంగా లేక గంటల తరబడి ప్రయాణంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో కక్షిదారులు సతమతమవుతున్నారు. ఒక్కోసారి సివిల్ దావా కేసుల్లో అంత దూరం నుంచి సత్తుపల్లికి వెళ్లి మరుసటి రోజే వాయిదా వేస్తే ఇంటికి వెళ్లి మరుసటి రోజు కోర్టు సమయానికి హాజరయ్యే పరిస్థితి లేకపోవడంతో, ఆ రాత్రి అక్కడే బసచేసి మరుసటి రోజు కోర్టుకు హాజరైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇలా కక్షిదారులు, న్యాయవాదులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ మేరకు 2015 ఫిబ్రవరిలో న్యాయవాదులు 40 రోజులు పాటు విధులు బహిష్కరించి నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలకు రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలిపారు. నాడు మధిర న్యాయవాదుల ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఇక 'సాక్షి'లోనూ మధిరలో సబ్ కోర్టు ఏర్పాటు ఆవశ్యకతపై పలుమార్లు కథనాలను ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు తాజాగా సబ్ కోర్టు మంజూరు కావడంతో ఈ ప్రాంత ప్రజలు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దూరాభారంతో తిప్పలు
నాడు మధిర కోర్టు స్థాపించినప్పుడు అశ్వారావుపేట, ఏన్కూరు, సత్తుపల్లి, వీఎం బంజర, దమ్మపేట, కల్లూరు తదితర ప్రస్తుత మండలాలు ఈ కోర్టు పరిధిలోనే ఉండేవి. ఆ తర్వాత 1978లో సత్తుపల్లికి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు మంజూరైంది. దీంతో మధిర కోర్టు పరిధిలో ప్రస్తుతం తల్లాడ, వైరా, ఎర్రుపాలెం, బోనకల్, మధిర మండలాలు మాత్రమే ఉన్నాయి. జిల్లాలోనే ఖమ్మం తర్వాత అత్యధిక కేసులు నమోదైన కోర్టుగా మధిరకు గుర్తింపు ఉండేది. పలు రాజకీయ కారణాల నేపథ్యంలో మధిరకు మంజూరు కావాల్సిన సబ్ కోర్టును 1981లో సత్తుపల్లికి కేటాయించారు. అప్పటి నుంచి మధిర కోర్టు పరిధిలోని రూ.లక్ష దాటిన సివిల్ కేసులు, మూడేళ్లకు పైగా శిక్ష పడిన క్రిమినల్ కేసులు, విడాకుల కేసులు, భూసేకరణ, మున్సిపల్ చట్టం, అత్యాచారం తదితర కేసులన్నీ సత్తుపల్లి కోర్టుకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఈ ప్రాంతానికి చెందిన కక్షిదారులు, ప్రజలు, న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రారంభం కాని భవన నిర్మాణం
మధిరలో కోర్టు భవన సముదాయ నిర్మాణానికి ప్రభుత్వం న్యాయశాఖ ఆధ్వర్యంలో 2022 ఫిబ్రవరి 13న రూ.24 కోట్లు మంజూరు చేసింది. కానీ నిర్మాణంలో ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు. పాత కోర్టు భవనం శిథిలావస్థకు చేరడంతో తాత్కాలికంగా పశువుల ఆసుపత్రిలో కోర్టు కొనసాగుతోంది. అక్కడ భవనం ఇరుకుగా ఉండడం, బార్ అసోసియేషన్ కు సమావేశపు హాలు లేకపోవడం, కోర్టు సిబ్బందికి సైతం విధి నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతుండడంతో న్యాయవాదులు ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి వినతి పత్రాలు అందజేసినా పనులు ముందుకు సాగడం లేదు.

టెండర్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంది..

కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నివేదికను హైకోర్టు రిజిస్ట్రార్‌కు పంపించాం. అక్కడి నుంచి ఆమోదం తెలిపి ఆర్అండ్‌బీ శాఖకు పంపితే టెండర్ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. టెండర్ల విధానం పూర్తయిన తర్వాత భవన నిర్మాణం మొదలవుతుంది.

– రాజేష్, ఏఈ, ఆర్అండ్ బీ

అందరి సహకారంతోనే..

ఈ ప్రాంత ప్రజలు, అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, జర్నలిస్టులు అందరి సహకారంతోనే మధిరకు సబ్ కోర్టు మంజూరు అయింది. దీంతో సుదూర ప్రాంతంలో ఉన్న సత్తుపల్లికి వెళ్లే ఇబ్బందులు తీరనున్నాయి. తాత్కాలిక కోర్టులో వసతుల లేమితో ఇబ్బందులు తప్పడం లేదు.

– దేవరపల్లి సుబ్రహ్మణ్యం, న్యాయవాది

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

మధిర ప్రాంత ప్రజల దశాబ్దాల కోరిక నెరవేరింది. మధిరలో సబ్ కోర్టు ఏర్పాటుకు సహకరించిన వివిధ వర్గాల ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. అదేవిధంగా కోర్టు భవన నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించాలి. అధునాతన హంగులతో కోర్టు నిర్మించాలి.

– కోట జ్ఞానేష్, న్యాయవాది

భవన నిర్మాణం ప్రారంభించాలి

స్వాతంత్య్రానికి ముందే మధిరలో కోర్టు ఏర్పాటైంది. నైజాం కాలంలోనే మధిర కోర్టుకు గుర్తింపు ఉండేది. ప్రాముఖ్యత కలిగిన కోర్టుకు దశాబ్దాల కాలంగా సబ్ కోర్టు మంజూరు కాలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయం. సంవత్సరం గడిచినప్పటికీ నూతన కోర్టు భవన సముదాయాన్ని నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.


– వాసిరెడ్డి వెంకటేశ్వరరావు

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. 389 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.12,935, 200 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.10,520 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కల్చరల్ యూనిట్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: స్వర మాధురి కల్చరల్ యూనిట్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన మధుర గీతాలను గాయనీ, గాయకులు ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి యూనిట్ ప్రతినిధులు పూలమాల వేసి సంగీత విభావరిని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన సీనియర్ రంగస్థల నటులు పుతుంబాక కృష్ణ ప్రసాద్, నెలనెలా వెన్నెల నిర్వాహకులు, అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ కార్యదర్శి ఏఎస్ కుమార్, కల్చరల్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిరాజు పురుషోత్తమరావు, ఎస్.ప్రకాష్, గాయనీ గాయకులు నిర్మల కామేష్(తాడేపల్లి గూడెం), వి మాలతి(ఖమ్మం), ఆకుల గణపతిరాజు, ఆరెపల్లి పున్నయ్య, ప్రకాష్, ఎస్‌కు ఇమామ్, ఎండీ అహ్మద్ పాల్గొన్నారు.

గురుకులాల చాంపియన్‌గా గుండాల

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు


వాలీబాల్ విజేతలతో గుండాల గురుకుల పాఠశాల సిబ్బంది

గుండాల: గుండాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గిరిజన గురుకులాల 7వ జోనల్ లెవల్ క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. గుండాల గురుకుల పాఠశాల జట్లు సత్తా చాటి చాంపియన్‌గా నిలిచాయి. గత శుక్రవారం పోటీలు ప్రారంభం కాగా, ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి 18 పాఠశాలలు, కళాశాలలకు చెందిన 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో గుండాల గురుకులం జట్లు ప్రథమస్థానంలో నిలిచాయి. కిన్నెరసాని గురుకుల జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఖోఖో క్రీడల్లో గుండాల గురుకులం జట్టు మొదటి స్థానం, కృష్ణసాగర్ గురుకులం జట్టు రెండో స్థానం సాధించాయి. కబడ్డీ పోటీలో మిర్యాలగూడ గురుకులం మొదటి స్థానం, పెద్దవూర గురుకులం ద్వితీయ స్థానంలో నిలిచాయి. హ్యాండ్‌బాల్‌లో కృష్ణసాగర్ విద్యార్థులు ప్రథమ, దమ్మపేట గురుకుల జట్టు ద్వితీయ, ఫుట్‌బాల్ పోటీలో మిర్యాలగూడ గురుకులం మొదటి, దమ్మపేట గురుకులం విద్యార్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచారు. చెస్ పోటీలో మిర్యాలగూడ మొదటి స్థానం, తిరుమలాయపాలెం గురుకులం ద్వితీయ స్థానం, క్యారమ్స్ పోటీలో హుజూర్‌నగర్ మొదటి స్థానం, దామరచర్ల ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలను గుండాల గురుకులం ప్రిన్సిపాల్ హరికృష్ణ తదితరులు అభినందించారు.

ముగిసిన గురుకుల క్రీడాపోటీలు


విజేతను అభినందిస్తున్న ఆర్‌సీఓ ప్రత్యూష

ములకలపల్లి: మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ కాలేజీలో నిర్వహిస్తున్న గురుకులాల 9వ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం ముగిసింది. ఈ క్రీడల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 14 గురుకులాలకు చెందిన 1,200 క్రీడాకారులు పాల్గొనగా, మూడు రోజుల పాటు నిరంతరాయంగా సాగాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీలను స్థానిక ఎస్సై సాయికిషోర్‌రెడ్డి ప్రారంభించారు. ముగింపు సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన క్యాంప్‌ఫైర్ ప్రత్యేకాకర్షణగా నిలిచింది, విజేతలను ఆర్‌సీఓ ప్రత్యూష అభినందించారు. సోమవారం ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో విజేతలకు షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ సునిత, ఎస్ఎంసీ చైర్మన్ గొడ్ల రాజు, సభ్యులు పుట్టా రాంబాబు, దాగం శ్రీను, బిక్కులాల్, ఏడుకొండలు, చిన్నకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావానికి నిదర్శనం 'నవ'


మాజీ ఉద్యోగులను సన్మానిస్తున్న నవ లిమిటెడ్ అధికారులు

పాల్వంచ : అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఎప్పుడూ మంచి పేరు ఉంటుందని, అందుకు నవభారత్ మాజీ ఉద్యోగులే నిదర్శనమని నవ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్, రేర్ అడ్మిరల్ ఎల్.వి.శరత్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక నవనగర్‌లో మాజీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ బాబు మాట్లాడుతూ మాజీ ఉద్యోగుల సేవలను కొనియాడారు. నాటి ఉద్యోగుల నిరంతర కృషి వల్లే నేడు నవభారత్ విద్య, వైద్య, సంక్షేమ కార్యక్రమాలతో సర్వతోముఖాభివృద్ధి చెందిందన్నారు. సంస్థ మాజీ ఉద్యోగులంటే యాజమాన్యానికి అపార గౌరవం ఉందన్నారు. అనంతరం మాజీ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో నవ లిమిటెడ్ జనరల్ మేనేజర్ వి.వి.రాజేశ్వరరావు, మాజీ ఉద్యోగులు పి.సుబ్బారావు, టి.జగదీశ్, ఈ.రాజయ్య, పి.వెంకటేశ్వరరావు, ఎస్.కృష్ణారావు, ఎస్‌డి.బాజీ. సుబ్బయ్య, పీఎస్ఎన్ రెడ్డి, కృష్ణారావు, పిచ్చేశ్వరరావు, సమ్మయ్య, ఎన్.పి.చారి, ఎండి.అలీ, జీఎస్.రావు, నర్సయ్య, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.